www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 5 మార్చి 2025 | 5 | కాకినాడ

క్విజ్‌లో వెంకటరమణకు ప్రథమ బహుమతి

పెద్దాపురం: జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో మండలంలోని కాండ్రకోట జడ్‌పి హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి నీలం వెంకటరమణ ప్రథమ బహుమతి సాధించాడని పాఠశాల హెచ్‌ఎం ఎంఎస్‌సి.మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కాకినాడ మంగళవారం కాకినాడ పైండా సత్తిరాజు మున్సిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారని, ఈ పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థి ప్రథమ బహుమతి సాధించడం అభినందనీయమని హెచ్‌ఎం అన్నారు. విజేతను హెచ్‌ఎంతోపాటు, ఎస్‌ఎంసి ఛైర్మన్ కట్టా దేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

భానుడి భగభగ

- క్రమంగా పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

వేసవి పూర్తిగా రాకముందే జిల్లాలో ఎండల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. గడిచిన రెండు వారాలుగా రోజురోజుకు భానుడు భగ భగమంటున్నాడు. ఫిబ్రవరి రెండో వారం నుంచే ఎండల తీవ్రత ప్రారంభమైంది. మార్చినాటికి ఇవి మరింత ముదిరాయి. ఇక ఎలా ఉండబోతోందనే జనం బెంబేలెత్తుతున్నారు. మరో పక్క రాత్రి వేళలో పొద్దుపోయిన తర్వాత చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ విచిత్ర వాతావరణంలో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు వివిధ రోగాల బారిన పడుతున్నారు. ఈ ఏడాది ఎండలు ఎక్కువ ఉంటాయనే వాతావరణ హెచ్చరికలతో మరింత ఆందోళన పెరిగింది.

36 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. మొదటి వారంలోనే పలుప్రాంతాల్లో 38 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో పక్క ఉక్కపోత ప్రజలను కుదురుగా ఉండనీయట్లేదు. జిల్లాలో ఎండల తీవ్రత పెరగడంతో ఎసిలు, కూలర్ల వినియోగం పెరిగింది. చాలా మంది తమ ఇళ్లలో ఉన్న ఎసిలకు సర్వీసింగ్ చేయిస్తున్నారు. వీటితో పాటు కూలర్లు కూడా రిపేరు చేయించుకుంటున్నారు. అలాగే ఎత్తయిన భవనాల్లో ఉండేవాళ్లు కూల్ పేయింట్లను వేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. గ్రామాల్లో కూడా జనం ఇళ్లపైన ఆరుబయట పడుకోవటం ఆరంభించారు. మార్చి చివర నాటికి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ఇంత ఎండలేదని ఈ సారి భానుడు భగ భగమంటున్నాడని ప్రజలు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు ఉక్కిరి బిక్కిరి ఈ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. దీంతో మధ్యాహ్నం విద్యార్థులు తిరుగు ప్రయాణంలో అవస్థలు పడుతున్నారు. అలాగే ఈ నెల 17 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. బాగా ఎండల తీవ్రత పెరుగుతున్న సమయంలో పరీక్షలు ప్రారంభం కావటంతో పిల్లలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పరీక్షలు ఉదయమే ప్రారంభం అవుతాయి కనుక ఎండ తీవ్రత కొద్దిగా తక్కువ ఉన్నా పరీక్ష ముగిసే సమయానికి మాత్రం ఎండలు అదరగొట్టే అవకాశం ఉంటుంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పరీక్షలకు సిద్ధమవ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

తేదీ	కనిష్టం	గరిష్టం
ఫిబ్రవరి 27	18.4	36.6
ఫిబ్రవరి 28	21.0	35.6
మార్చి 1	21.8	38.8
మార్చి 2	20.9	36.2
మార్చి 3	21.7	35.4
మార్చి 4	22.0	38.0

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- బయటకు వెళ్లేటపుడు తప్పకుండా గొడుగు లేదా టోపీ వాడాలి
- తెలుపు రంగు, పలుచటి దుస్తులు, లూజుగా కాటన్ దుస్తులను ధరించాలి
- ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో ఆరుబయట తిరుగకూడదు.
- వీలైనన్ని సార్లు నీరు తీసుకోవాలి. ఎండలో తిరిగే సమయంలో కొబ్బరి నీరు, మజ్జిగ, నీటిలో నిమ్మరసం, కాస్తంత ఉప్పు కలిపిన ద్రావణాన్ని తీసుకోవాలి.
- ఎండలో బయటకు వెళ్లినపుడు తల తిరగడం వికారంగా ఉండటం జరిగితే తక్షణమే వైద్యులను సంప్రదించాలి.

పేరాబత్తుల విజయం

- దాదాపు 30 గంటలు సాగిన ఓట్ల లెక్కింపు
- 77,461 ఓట్ల మెజార్టీతో గెలుపు

విజయ సంకేతం చూపుతున్న పేరాబత్తుల రాజశేఖరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించారు. తొలి ప్రాధాన్యత ఓటుతోనే విజయం సొంతం చేసుకున్నారు. ప్రత్యర్థి పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘువులుపై 77,461 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపుతో కూటమి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఫిబ్రవరి 27న ఎన్నికల పోలింగ్ జరగ్గా మొత్తం 3,14,984 ఓట్లకుగాను 2,18,902 ఓట్లు పోలయ్యాయి. ఈ నెల మూడో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. దాదాపు 12 గంటలపాటు ఓట్లు కట్టలు కట్టడమే సరిపోయింది. 16 గంటల తరువాత తొలి రౌండ్ ఫలితాలు వెల్లడించారు. దాదాపు 30 గంటల తర్వాత నాలుగో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యింది.

తొలి ప్రాధాన్యతా ఓట్లతోనే టిడిపి అభ్యర్థి గెలుపు

ఎంఎల్‌సి ఎన్నికల్లో పోస్టల్ ఓట్లతో కలిపి మొత్తం 2,18,997 ఓట్లు పోలైనట్లు అధికారులు తేల్చారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టగా 19,789 ఓట్లు చెల్లనివి తేలాయి. చెల్లుబాటు ఓట్లు 1,99,208గా తేల్చారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో గెలుపు సాధించాలంటే 99,604 ఓట్లు రావాల్సి ఉండగా టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొత్తం 1,24,702 ఓట్లు వచ్చాయి. ఏడో రౌండ్‌లోనే టిడిపి అభ్యర్థి గెలుపునకు సంబంధించిన మ్యాజిక్ ఫిగర్‌ను దాటేశారు. పిడిఎఫ్ అభ్యర్థికి ఈ ఎన్నికల్లో మొత్తం 47,241 ఓట్లు వచ్చాయి.

ఓటింగ్ ప్రక్రియపై అవగాహనలో అధికారులు విఫలం

ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓట్లు వేసే అంకెలపై అధికారులకు, ఏజెంట్లకు మధ్య మూడో తేదీ రాత్రి వాగ్వివాదం చోటుచేసుకుంది. నిబంధనల ప్రకారం అభ్యర్థి పేరు ముందు బాక్సులో ఒకటి మాత్రమే వేయాలని, రోమన్ అంకెలు వేయకూడదని, అలా వేస్తే చెల్లదని చెబుతూ వచ్చారు. కానీ కౌంటింగ్ ప్రక్రియలో మాత్రం రోమన్ అంకె ఒకటి వేసినా చెల్లుబాటు అవుతుందని తేల్చారు. అదేవిధంగా ఒకటి అంకె తప్ప గడిలో మరేమీ వేయకూడదని ప్రచారంలో అభ్యర్థులు సైతం ఓటర్లకు తెలిపారు. ఒకటికి ముందు జీరో వేసినా ఓటు చెల్లుబాటు అవుతుందని కౌంటింగ్‌లో అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా ఒకటి వేసి ఒకటి చుట్టూ సున్నా చుట్టినా ఓట్లు చెల్లుబాటు అవుతాయని చెప్పడంపై పలువురు అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లు అభ్యంతరం తెలిపారు. ఎన్నికల ముందు అభ్యర్థులతో జరిగిన సమావేశాల్లో ఓటింగ్ ప్రక్రియపై అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడం వల్లే ఇది జరిగిందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల నిబంధనావళి బుక్‌లో ఉన్నట్లు అధికారులు చెప్పడం విశేషం.

కూటమిపై నమ్మకమే గెలుపునకు కారణం
పేరాబత్తుల రాజశేఖరం

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకమే ఈ గెలుపునకు కారణం. ఎన్నికల రోజు లోకేష్ నిరంతరం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ ముందుకు నడిపించారు. అందరినీ ఏకతాటిపైకి తెచ్చి గెలుపునకు లోకేష్ ఎనలేని కృషి చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలవడం ఆనందంగా ఉంది. పట్టభద్రులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. నా గెలుపునకు కృషి చేసిన నేతలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు
దిడ్ల వీరరాఘువులు, పిడిఎఫ్ అభ్యర్థి

ఎంఎల్‌సి అభ్యర్థిగా నామినేషన్ ఘట్టం నుంచి చివరి వరకూ నాకు మద్దతు తెలిపి ఓటేసిన పట్టభద్రులకు, నా ప్రచారంలో పాల్గొని సహకరించిన శ్రేణులకు అందరికీ కృతజ్ఞతలు. భవిష్యత్తులోనూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, మహిళల, యువత పక్షాన పోరాటం కొనసాగుతోంది.

ఊబకాయం ఒక మహమ్మారి

ప్రజాశక్తి - కాకినాడ

ఊబకాయం ఒక మహమ్మారి అని మెడికవర్ వైద్య నిపుణులు డాక్టర్ వసంతకుమార్, డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మెడికవర్ ఆసుపత్రిలో ప్రపంచ స్థూలకాయ దినోత్సవం సందర్భంగా అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహారంలో మార్పులు శారీరక శ్రమ తగ్గడం కారణంగానే రోజురోజుకు ఊబకాయలు పెరుగుతున్నారన్నారు. జన్యుపరంగా హార్మోన్స్ ప్రభావం వల్ల చిన్న వయసులోనే చాలా మంది ఊబకాయంతో బాధపడుతున్నారన్నారు. ఇది అనేక తీవ్రమైన వ్యాధులకు కారణమవుతుందని అన్నారు. ఊబకాయం దాదాపు ప్రతి అవయువాలపైనా ప్రభావం చూపుతాయని అన్నారు. పొత్తికడుపులో పేరుకు పోయిన కొవ్వు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించే ఇన్సులిన్ సామర్థ్యానికి ఆటంకం కలిగిస్తుందన్నారు. దీని వలన మధుమేహం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఊబకాయం ఉన్నవారిలో ఆకస్మిక కార్డియాక్ డెత్ ప్రమాదం మూడు రెట్లు ఎక్కువగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ శుభాకరరావు, మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్ గౌతమ్‌రామ్ పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న వైద్యులు వసంత్‌కుమార్, వంశీకృష్ణ

7, 8 తేదీల్లో సిపిఎం సైకిల్ యాత్ర

-హాజరుకానున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్నఈశ్వరరావు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజా సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం చేపట్టనున్న సైకిల్ యాత్రను తాళ్ళరేవు మండలంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈనెల 7వ తేదీన ప్రారం భిస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు వెల్లడించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చొల్లంగి నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర రెండు రోజులపాటు మండలంలోని పలు గ్రామాలలో సాగుతుందన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ రాష్ట్ర నాయకులతో పాటు జిల్లా నాయకులు ముందుకు వెళ్తారని తెలిపారు. మండలంలో అసైన్డ్ భూములు, కంపెనీల కాలుష్యం, స్మశాన భూములు, సాగునీరు, తాగునీటి సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. సైకిల్ యాత్ర వెళ్లే గ్రామాలలో ప్రజలంతా తమ సమస్యలను నాయకులు దృష్టికి తీసుకురావాలని కోరారు. యాత్రకు సంబంధించి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రజానీకమంతా జయప్రదం చేయాలని ఈశ్వరరావు కోరారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు వల్లు రాజుబాబు, దుప్పి అదృష్టదీపుడు, చల్లా సంతోష్‌కుమార్, నేరేడుమిల్లి త్రిమూర్తులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి: కలెక్టర్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా వ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థితిగతులపై క్షేత్రస్థాయిలో చేపట్టిన సర్వేను వేగవంతం చేసి ఈనెల 15 నాటికి పూర్తి చేయాలనికలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. వేసవి కార్యచరణ ప్రణాళిక, వర్క్ ఫ్రం హోం, ఎంఎస్‌ఎంఇ, గ్రామ, వార్డు సచివాలయాల హౌస్ హోల్డ్ సర్వేల పురోగతిపై మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జరిగే ఎంఎస్‌ఎంఇ సర్వే ద్వారా వ్యాపారాలకు సంబంధించి ప్రతి షాపు, పరిశ్రమల నుంచి పూర్తి స్థాయిలో వివరాలు నమోదు చేసి, ప్రత్యేక యాప్‌లో సర్వే వివరాలను నమోదు చేయాలన్నారు. జిల్లాలో ఎంఎస్‌ఎంఇ సర్వేకు సంబంధించి 78,299 లక్ష్యంగాను ఇప్పటివరకు 73,330 పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన సర్వే ప్రక్రియను వేగవంతం చేసి మార్చి15 నాటికి పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. అదేవిధ:గా వర్క్ ఫ్రం హోం, గ్రామ, వార్డు సచివాలయాల్లో హౌస్ హోల్డ్ సర్వేలపై ప్రత్యేక దృష్టి పెట్టి నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలని అన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు గ్రామ స్థాయిలో ఉన్న సచివాలయం సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ఈ సర్వేల్లో పురోగతి సాధించాలన్నారు. వేసవిలో తాగునీటికి సంబంధించి అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలని, పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తతో వ్యవహరించి ఎక్కడ తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు తాగునీరు నాణ్యతపై పరీక్షలు చేయించాలన్నారు. 0-5 సంవత్సరాల లోపు చిన్నారులందరికి ఆధార్ సంఖ్య నమోదు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జడ్‌పి సిఇఒ లక్ష్మణరావు, డిపిఒ రవికుమార్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ నరసింహనాయక్, పరిశ్రమల శాఖ డిఎం పిహెచ్.గణపతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ ఎన్.భారతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సింహాచలంకు ఉత్తమ సేవా పురస్కారం

సింహాచలాన్ని అభినందిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

విద్యుత్ శాఖలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటి సేవలు అందిస్తున్న లైన్‌మేన్ కుంచె సింహాచలం ఉత్తమ లైన్‌మేన్‌గా ఎంపికయ్యారు. మంగళవారం లైన్‌మేన్ డే సందర్భంగా డిఇ వీరభద్రరావు, డిఇఇ రాజశేఖర్, ఏలేశ్వరం ఎఇ జి.సూర్యనారాయణ ఉత్తమ లైన్‌మేన్‌గా ఎంపికైన సింహాచలాన్ని సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింహాచలం వృత్తి పట్ల అంకితభావంతో పని చేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలందించడం అభినందనీయమన్నారు ప్రతి ఒక్క ఉద్యోగి సింహాచలం సేవలను ఆదర్శంగా తీసుకుని వినియోగదారులకు సేవలు అందించాలని పిలుపునిచ్చారు.

జిజిహెచ్‌లో రోగులకు అవస్థలు

ప్రజాశక్తి - కాకినాడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాను మూడు జిల్లాలుగా విభజన చేసి పరిపాలనా వికేంద్రీకరణ చేసినా కాకినాడ జిజిహెచ్‌ను వికేంద్రీకరణ చేయకపోవడంతో రోగులు పలు అవస్థలకు గురౌతున్నారని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరతతో రోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. 180 మంది ఎంఎన్‌ఒలు అవసరం కాగా, 110మంది మాత్రమే విధుల్లో ఉంటున్నారని అన్నారు. కాకినాడ జిజిహెచ్‌ను కాకినాడ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిగా విభజించి రోగులకు సేవలు అందించాలని కోరారు.

ఏప్రిల్ 30న పాలిసెట్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - పిఠాపురం

పాలిటెక్నికల్ ప్రవేశ పరీక్ష పాలిసెట్ ఏప్రిల్ 30వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని స్థానిక పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.మురళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసారి పిఠాపురం కేంద్రంగా కూడా పాలీసెట్ ప్రవేశ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులు అయిన వారితోపాటు ప్రస్తుతం 10వ తరగతి పరీక్షలు రాసే వారు కూడా పాలీసెట్ ప్రవేశ పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు రూ.100, బిసి, ఒసి అభ్యర్థులు రూ.400 ఫీజు చెల్లించాల్సివుంటుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం స్థానిక పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా రిజిస్టర్ చేసుకుంటే ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజు ఉండదన్నారు. కళాశాలలో ఈసారి పాలిటెక్నికల్ కోర్సుల్లో చేరే మొదటి సంవత్సరం విద్యార్థులకు మెస్ సౌకర్యం కల్పిస్తామని, దీంతోపాటు అనుభవజ్ఞులైన డాక్టరేట్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన అధ్యాపకులు ఉన్నారన్నారు.

ఎక్కువ మందికి ఉపాధి పనులు

కూలీల హాజరుపట్టీని పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్కువ మందికి ఉపాధి పనులు కల్పించేందుకు కృషి చేయాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి ఆదేశించారు. మంగళవారం మండలంలోని కట్టమూరులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. రాయన్న చెరువు ఉపాధి పనులను పరిశీలించి మస్టర్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కూలీలకు కల్పిస్తున్న ఉపాధి పనులు, వారికి వస్తున్న వేతనాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె గ్రామంలోని గోకులం పశువుల శాలలను, నిర్మాణంలో ఉన్న సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ డి.సుధీర్, జెఇ వి.సతీష్, టెక్నికల్ అసిస్టెంట్ కె.శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ కె.వీరబాబు పాల్గొన్నారు.

చంద్రబాబు రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

రాజ్యాంగ విరుద్ధంగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సిఎం పదవికి రాజీనామా చేయాలని వైసిపి జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు ఒమ్మి రఘురామ్ డిమాండ్ చేశారు. మంగళవారం జగ్గంపేటలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ బద్ధంగా పదవిలోకి వచ్చిన చంద్రబాబు రాజ్యాంగ విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని అన్నారు. వైసిపి వారికి మేలు చేస్తే పాముకు పాలు పోసినట్లేనని టిడిపి సమావేశంలో చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని అతిక్రమించడమేనని అన్నారు. 14 ఏళ్ల సిఎంగా పనిచేసిన వ్యక్తి నుంచి ఇటువంటి వ్యాఖ్యలు సరి కాదన్నారు. రాష్ట్రంలో కొందరికే పాలన అందిస్తారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అంటే అందరి వాడుగా ఉండాలని, కొందరి వాడుగా కొనసాగడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

కార్టూ'నిజం'



వరుపుల రాజాకు ఘన నివాళి

ప్రత్తిపాడులో వరుపుల రాజా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎల్‌ఎ సత్యప్రభ, అభిమానులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాల్లో డిసిసిబి మాజీ ఛైర్మన్ వరుపుల రాజా వర్ధంతిని నిర్వహించారు. రాజా స్వగ్రామమైన పెదశంకర్లపూడి వరుపుల రాజా సమాధి వద్ద ఆయన సతీమణి, ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో రాజా చేసిన సేవలు ప్రజలు మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. రాజా మీద ఉన్న అభిమానంతోనే నియోజకవర్గ ప్రజలు నన్ను ఆదరించి ఎన్నికల్లో గెలిపించి శాసనసభకు పంపించారన్నారు. ప్రత్తిపాడులో టిడిపి శ్రేణులు రాజా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్తిపాడ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, అమరాధి వెంకట్రావు, వరుపుల కృష్ణ, చక్కపల్లి నవీన్ పాల్గొన్నారు. **శంఖవరం** వరుపుల రాజాకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. వరుపుల రాజా వర్ధంతి సందర్భంగా టిడిపి నాయకుడు న్యాయవాది రాజాల చిట్టిబాబు ఆధ్వర్యంలో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం సెంటర్లో రాజా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.నరసయ్య, ఉపసర్పంచ్ బండారు రాంబాబు, నాయకులు వీర్ల సూరిబాబు, ఎం.వీరబాబు, బి.సత్తిబాబు, బి.సురేష్ పాల్గొన్నారు. **రౌతులపూడి** వరపుల రాజా వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, టిడిపి మండల అధ్యక్షులు తామరాల సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు సోమరౌతు రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి భాస్కర్‌బాబు, టిడిపి నాయకులు సింహాద్రి పెదబాబు, పైలా పైడ్రాజు, సోమరౌతు మౌళి పాల్గొన్నారు. **ఏలేశ్వరం** వరుపుల రాజా చిత్రపటానికి ఎంపిపి గొల్లపల్లి బుజ్జి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువ నాయకుడు బొద్దిరెడ్డి గోపి ఆధ్వర్యంలో ఆసుపత్రుల్లో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు సూతి బూరయ్య, మాజీ జడ్‌పిటిసి జ్యోతుల పెదబాబు, వార్డ్ కౌన్సిలర్లు మూదీ నారాయణస్వామి, పిండ్రాల శ్రీను, యండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఛైర్మన్‌లు జొన్నాడ వీరబాబు, వాగు రాజేష్ పాల్గొన్నారు.

రైతుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - గండేపల్లి

రైతుల రిజిస్ట్రేషన్‌ను త్వరతగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి సూచించారు. మంగళవారం మండలం తాళ్ళూరు, జెడ్.రాగంపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రిజిస్ట్రేషన్‌లో ఇప్పటి వరకు మండలంలో 6390 నమోదు పూర్తి అయిందన్నారు. ఇంకా సుమారు 1000 చేయాల్సివుందన్నారు. రైతులు త్వరితగతిన నమోదు చేసుకోవాలని కోరారు. రైతులందరూ రబీ-24-35 పంటలో కోత అనంతరం పచ్చిరొట్ట పైరులు, అపరాలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ చంద్రమౌళి, విఎఎ పృథ్వీ, సురేఖ పాల్గొన్నారు.

సిరిపురంలో అన్నదానం

ప్రజాశక్తి - కరప

మండలంలోని సిరిపురంలో సాయిబాబా ఆలయం వద్ద 24వ వార్షికోత్సవం సందర్భంగా జనసేన నాయకులు చిక్కాల దొరబాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురి మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద జనసేనా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో మంగళవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నదానం కార్యక్రమంలో తుమ్మలపల్లి రమేష్ పాల్గొని పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మేడిబోయిన శ్రీను, రాజనాల శ్రీను, సురపరెడ్డి నరేష్, ఎంపిటిసి సభ్యులు దొడ్డ శ్రీను, మొగిలి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పశువుల పాక దగ్ధం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వి.కె.రాయపురం గ్రామంలో ఒక పశువుల పాక దగ్ధం అయింది. గ్రామానికి చెందిన రంగారావు వీరభద్రరావుకు చెందిన పశువుల పాకలో సోమవారం రాత్రి మూడు గేదెలు, రెండు లేగ దూడలను కట్టారు. ఈ పాక దగ్ధం అయింది. ఈ ప్రమాదంలో ఒక గేదె మృతి చెంగా, మిగిలిన పశువులకు గాయాలయ్యాయి. అగ్ని ప్రమాదానికి కారణం తెలియాల్సివుంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడ ప్రభుత్వసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు గుర్తి తెలియని వ్యక్తి ఆరోగ్యం విషమించి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. పెద్దాపురం దర్గా సెంటర్-కాండ్రకోట రహదారి పెట్రోల్ బంక్ సమీపంలో ప్రయివేట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా చుట్టుపక్కల వారు అతనిని ఈ నెల 2వ తేదీన జిజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆ వ్యక్తి ఆరోగ్యం విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఎస్ఐ వి.మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం చేయాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగిలో ఉన్న తన వ్యక్తిగత చేపల చెరువులో చేపలు పట్టుకుంటుంటే కొందరు అడ్డుకుంటున్నారని, వారిని నిలువరించి న్యాయం చేయాలని కోరంగి గ్రామానికి చెందిన వాసంశెట్టి సుందరేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వేనెంబర్ 254/ 1ఏ 3లో తనకు 2 ఎకరాల పది సెంట్లు చేపల చెరువు భూమి ఉన్నదని, ఆ చెరువును సాగు చేస్తుంటే పలువురు అడ్డుకుంటున్నారని గత నెల 18వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై తనకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై కోరంగి ఎస్ఐ పి. సత్యనారాయణ వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంఎల్‌సి దువ్వాడపై జనసేన నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి - కరప

కరప పోలీస్ స్టేషన్ లో ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్యలపై మంగళవారం జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, ఇతర నాయకులు మాట్లాడుతూ గత నెల 24వ తేదీన శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దువ్వాడ శ్రీనివాస్ ప్రజాశాంతికి భంగం కలిగేలా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌పై దురుద్దేశ్యంతో వ్యాఖ్యలు చేశారని తెలిపారు. తక్షణమే దువ్వాడపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పప్పుల మల్లిబాబు, గోన ఆంజనేయులు, యాళ్ల వీర వెంకట సత్యనారాయణ, యాళ్ల హరినాథ్, జిల్లెల్ల ప్రసాద్, చిన్నారి శ్రీనివాస్, నక్క బ్రహ్మాజీ, శాఖ వంశీ పాల్గొన్నారు.

హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సేవకులు

పాదగయ హుండీ ఆదాయం రూ.11.74 లక్షలు

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని ఉమా కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం (పాదగయ) హుండీల ఆదాయం రూ.11,74,660 వచ్చిందని ఇఒ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు. సిఎఫ్ఒ సిహెచ్.రామ్మోహనరావు, ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్ర కుమార్, జోగా సత్యనారాయణ పర్యవేక్షణలో హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ మాట్లాడుతూ మహాశివరాత్రి పురస్కరించుకుని 17 రోజులకుగాను రూ.11,74,660 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, బ్యాంకు, పోలీసు సిబ్బంది, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పెదపూడి

వర్క్ ఫ్రమ్ హోం సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపిడిఒ నరేంద్ర రెడ్డి, ఇఒపిఆర్‌డి ఎంఎస్ఎన్.రెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ పరిశ్రమలు, హౌస్ హోల్డ్స్, భూముల సర్వే, యానిమల్ హస్బండ్రీ వంటి ప్రతి యాప్‌ను అనునిత్యం సిబ్బంది అప్‌డేట్ చేయాలన్నారు. అలాగే గ్రామాల వారిగా జరగాల్సిన సర్వే త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి - సామర్లకోట

యోగా సాధనతో విద్యార్థుల్లో మానసిక ప్రశాంతత ఉంటుందని విశ్వమానత సంస్థ ఫౌండర్ చైర్మన్ అల్లూరి శ్రీనివాస్ చౌదరి అన్నారు. మంగళవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో 10వ తరగతి పరీక్షల్లో అద్భుత విజయాలు సాధించడం ఎలా అనే అంశంపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ నిత్య యోగ సాధన ద్వారా మాత్రమే మనస్సు ఆధీనం అవుతుందన్నారు. మనస్సు ఆధీనం అవుతేనే ఏకాగ్రత లభిస్తుందన్నారు. జీవితంలో ఏది సాధించాలన్నా సరైన ఆలోచన, మంచి మనసు ఉండాలన్నారు. జంక్ ఫుడ్ కు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. అనంతరం యోగ సాధన, ధ్యానం ఎలా చేయాలనే అంశాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వమానవత సంస్థ ప్రతినిధి పెమ్మాడి వీరభద్ర వర్మ, ట్రైనర్స్ మల్లాడి వీణామాధురి, పెమ్మాడి మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేనలోకి మాజీ ఎంఎల్ఎ పెండెం దొరబాబు..?

-14న జరిగే ఆవిర్భావ సభలో చేరిక

-దొరబాబు రాకతో టిడిపిలో అసంతృప్తి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

పిఠాపురం మాజీ ఎంఎల్ఎ పెండెం దొరబాబు జనసేన పార్టీలో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. కూటమి పార్టీలో భాగంగా దొరబాబు రాకుండటంతో టిడిపిలో అసంతృప్తి నెలకొంది. పిఠాపురం నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా ఎస్‌విఎస్ఎన్.వర్మ పోటీ చేయగా వైసిపి నుంచి పెండెం దొరబాబు పోటీ చేసి విజయం సాధించారు. వైసిపి అధికారం చేపట్టిన తర్వాత నియోజకవర్గంలో టిడిపి శ్రేణులపై మనోద్వేగ్యాన్ని నింపుతూ వర్మ ముందుకు సాగారు. 2024 పొత్తుల్లో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ చేయడంతో టిడిపి టిక్కెట్టును ఆశించిన వర్మ టిడిపి అధినేత చంద్రబాబు హామీతో పవన్ కళ్యాణ్ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారు. దీనికి అనుగుణంగా వర్మకు రాబోయే కాలంలో సముచిత స్థానం లభిస్తుందని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చెబుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎంఎల్‌సి కోటాలో వచ్చిన ఎంఎల్‌సి ఎన్నికల్లో వర్మకు స్థానం ఖాయమని పార్టీ శ్రేణులు ఆశతో ఉన్నారు. ఈ తరుణంలో పెండెం దొరబాబు వైసిపి పవన్ కళ్యాణ్‌కు కుటుంబ సమేతంగా కలిశారు. జనసేనలో చేరేందుకు పెండెం సానుకూలతను వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో ఈనెల 14న పిఠాపురం నియోజకవర్గంలో జరుగుతున్న జనసేన ఆవిర్భావ సభలో పవన్ సమక్షంలో ఆయన జనసేన తీర్థం పుచ్చుకునేందుకు ముహూర్తాన్ని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. వైసిపి పాలనలో ఇసుక, జగనన్న ఇళ్ల స్థలాల్లో అవినీతి పెద్దఎత్తున చోటుచేసుకుందని ప్రస్తుత డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పిఠాపురం బహిరంగ సభలో దుయ్యబట్టారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వ్యక్తిని జనసేనలో ఏవిధంగా చేర్చుకుంటారని స్థానిక టిడిపి నాయకులు ప్రశ్నిస్తున్నారు. గత ఎన్నికల్లో వైసిపి నుంచి టిక్కెట్టు రాకపోవడంతో దొరబాబు పార్టీని వీడారని, అయితే ఎన్నికల్లో మాత్రం వైసిపి అభ్యర్థి వంగా గీత విజయానికి, పవన్ కళ్యాణ్ ఓటమికి కృషి చేసిన వ్యక్తిని జనసేన పార్టీలోకి ఆహ్వానించడంపై టిడిపి శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. దొరబాబుతోపాటు, ఆయన వర్గీయులుగా ఉన్న పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఇతర వైసిపి నాయకులు సైతం జనసేనలో చేరేందుకు ఉత్సుకత చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నియోజకవర్గంలో టిడిపి, జనసేన పార్టీ శ్రేణుల మధ్య పోరు జరుగుతోంది. ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, టిడిపి ఇన్‌ఛార్జ్ వర్మకు మధ్య అంతర్గతంగా వివాదాలు నడుస్తున్నాయి. దీంతో అగ్గికి ఆజ్యం పోసినట్లుగా దొరబాబు చేరికతో టిడిపి, జనసేన నాయకుల పట్ల కుమ్ములాటలు తప్పదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుత నియోజకవర్గానికి జనసేన ఇన్‌ఛార్జ్‌గా మర్రెడ్డి శ్రీనివాస్ ఉన్నారు. దొరబాబు జనసేనలో చేరడంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు దొరబాబుకు అప్పగించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అదేజరిగితే ఇప్పటి వరకూ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న మర్రెడ్డి శ్రీనివాస్ సైతం అసంతృప్తికి లోనయ్యే అవకాశాలు లేకపోలేదు. ఏదిఏమైనా దొరబాబు రాకతో కూటమి పార్టీలో రగడ తప్పేట్లు లేదు.

10న అంగన్‌వాడీల చలో విజయవాడ

-తరలిరావాలని యూనియన్ నేతల పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు మార్చి 10న జరిగే చలో విజయవాడకు అంగన్‌వాడీలు తరలిరావాలని యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మ, ఎరుబండి చంద్రావతి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పీడీకి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం కచేరిపేట సిఐటియు కార్యాలయంలో జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ సమస్యలపై ప్రకటనలు చేయడం మినహా, జీవోలు విడుదల చేయడం లేదని, వేతనాల పెంపుపై మాట్లాడకుండా తప్పించుకుంటున్నదని విమర్శించారు. గత సంవత్సరం 42 ధర్నా రోజుల సందర్భంగా ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం మేరకు 2024 జూలైలో వేతనాలు పెంచాల్సి ఉందని, సమ్మె శిబిరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు సందర్శించి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేషశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం చేయటం లేదన్నారు. మరోవైపు సెల్‌ఫోన్ యాప్‌ల పేరుతో పని భారం విపరీతంగా పెంచారని, సెంటర్ అద్దెలు, పెండింగ్ బిల్లులు విడుదల చేయకుండా అంగన్‌వాడీలపై ఆర్థిక భారం మోపుతున్నారని, తక్షణం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌గా మారుస్తూ జీవో విడుదల చేయాలని, గ్రాడ్యుటీ అమలుకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కోశాధికారి రమణమ్మ, నాయకులు ఎస్తేరురాణి, రాజేశ్వరి, దాడి బేబీ, చామంతి, నీరజ, వీరవేణి, ధనలక్ష్మి, దివ్య, రామలక్ష్మి, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ పీడీకి వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

పేరాబత్తుల విజయంతో సంబరాలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్, గొల్లప్రోలు, తాళ్లరేవు

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సిగా పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించడంతో టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. మంగళవారం రూరల్ మండలం వలసపాలక గ్రామంలో నియోజకవర్గ టిడిపి కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి నివాసం వద్ద టిడిపి శ్రేణులు కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత ఓటుతోనే పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించడం ద్వారా కూటమి ప్రభుత్వంపై పట్టభద్రులకు ఉన్న నమ్మకాన్ని తెలియ చేసిందన్నారు. ఆయన విజయానికి కృషి చేసిన వారికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు లోని జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయంపై జనసేన కార్యకర్తలు సంబరాలు చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు దాసరి రాజు, పిఎన్ రాజు తదితరులు భారీ కేక్ కట్ చేశారు. బాణాసంచా కాల్చి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తాళ్లరేవు టిడిపి కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శి కట్ట త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన సంబరాల్లో స్వీట్లు పంచుకుని, బాణాసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, భజన సత్తిబాబు, వేగేశ్న భాస్కరరాజు, ధూళిపూడి వెంకటరమణ, మోపూరి వెంకటేశ్వరరావు, విల్ల వీర, దత్తాత్రేయ వర్మ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ మండలంలో సంబరాలు చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

విద్యార్థిచే ఫిజియోథెరపీ చేయిస్తున్న వైద్యులు

ఫిజియోథెరపీపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ విఆర్‌కె.చౌదరి అన్నారు. మంగళవారం భవిత కేంద్రంలో నిర్వహించిన ఫిజియోథెరపీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపీ ద్వారా వికలాంగ బాలలకు సత్ఫలితాలు వస్తున్నందున బాలల తల్లిదండ్రులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంఎల్.శివజ్యోతి, ఫిజియోథెరపీ డాక్టర్ బి.అపర్ణ, సిబ్బంది పి దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు పాల్గొన్నారు.

యానాం వార్తలు

ధర్నా చేస్తున్న మిల్క్ బాయిలర్స్ కార్మికులు

వేతనాల కోసం ఆందోళన

ప్రజాశక్తి - యానాం

రాజీవ్ గాంధీ అల్పాహార పథకం ద్వారా పలు ప్రభుత్వ పాఠశాలలో సుమారు 23 సంవత్సరాలుగా మిల్క్ బాయిలర్లుగా పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచాలని కోరుతూ స్థానిక జండా స్థంభం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ పాఠశాలలో పని చేస్తున్న వందలాది మంది సిబ్బంది తమకు రూ.10 వేల నుంచి రూ.18 వేలకు పెంచుతూ గత ఏడాది ప్రభుత్వం చేసిన ప్రకటన ఇప్పటికీ అమలు కాకపోవడంతో పుదుచ్చేరి వ్యాప్తంగా మిల్క్ బాయిలర్ చేపట్టిన ఆందోళన లో భాగంగా యానంలోని సిబ్బంది ఈ ఆందోళన చేపట్టారు. రూ.18 వేలు వేతనాలు పెంచకపోగా పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, పెంచు తానన్న వేతనాలకు పలు నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. తక్షణమే వేతనాలు పెంచి తమ సర్వీస్‌ను క్రమబద్ధకరించాలని డిమాండ్ చేశారు.

పొలంబడితో నాణ్యమైన ఆహారోత్పత్తులు

ప్రజాశక్తి - యానాం

పొలంబడి కార్యక్రమంతో రైతులు పురుగుమందుల అవశేషాలు లేని నాణ్యమైన ఆహారోత్పత్తులు సాధించవచ్చని పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎ.సీతారామ శర్మ అన్నారు. మంగళవారం స్థానిక దరియాలతిప్ప గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో చీడపీడల నివారణ, సాగుకు సంబంధించిన పలు విషయాలను రైతులకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో చిక్కాల జోగిరాజు, కూనంరెడ్డి సుబ్బారావు, రూప, చినబాబు, విజయ్‌కుమార్, మల్లాడి శీను, ములపర్తి అప్పారావు, కోరుకొండ బాలయోగి, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ మహిళలు రాణించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం, గొల్లప్రోలు, కిర్లంపూడి

అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందినప్పుడే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం పెద్దాపురం పట్టణంలోని శంకరయ్య పేట అంగనవాడి కేంద్రంలో ప్రపంచ మహిళా దినోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలందరూ నూరు శాతం చదువుకోవాలన్నారు. మహిళలు ఏదో ఒక రంగంలో ఉపాధి పొందటం ద్వారా ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు. గొల్లప్రోలు పట్టణంలోని కరణం గారి తోట అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యకరమైన మహిళ, కాన్సెప్ట్‌పై యోగ, తృణ ధాన్యాలతో వంటకాలు, వాటి ఉపయోగాలపై ఐసిడిఎస్ అధికారి దుర్గాదేవి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్రూట్స్, ఆహార పదార్థాల ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మానసా దేవి, నాగమణి , అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కిర్లంపూడి మహిళా సమైఖ్య కార్యాలయంలో ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.పూర్ణ ఆధ్వర్యంలో 'ఆరోగ్యవంతమైన మహిళ, ఆనందంగా ఉన్న మహిళ' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. నేటి ఆధునిక సమాజంలో అన్ని సాంకేతిక రంగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. మహిళలు మరిన్ని రంగాల్లో దూసుకుపోవాలంటే మహిళలు ఆనందంగా ఉండడమే కాకుండా ఆరోగ్యవంతంగా ఉండడానికి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి పి.సాయిరమ్య, ఎంపిడిఒ బావిశెట్టి హరికృష్ణ, తహశీల్దార్ జె.చిరంజీవి, ఎంఇఒ టి.జోసెఫ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సైన్స్ సెంటర్‌కు రిఫ్రిజిరేటర్ బహూకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

రిఫ్రిజిరేటర్‌ను అందిస్తున్న దాతలు

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌కు మంగళ వారం సూర్య ఎలక్ట్రానిక్స్, ఎల్‌జి షోరూం అధినేతలు దోమాడ వీరబాబు, అర్జున్ ఎల్‌జి రిఫ్రిజిరేటర్‌ను బహు కరించారు. ఈ సందర్భంగా సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా సైన్సు సెంటర్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా సైన్స్ ప్రయోగాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సైన్సు ప్రయోగాలకు సంబంధించి వివిధ రకాల రసాయనాలు, పదార్థాలు నిలవ చేసుకునేందుకు ఈ రిఫ్రిజిరేటర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఎసిటి సైన్స్ సెంటర్ చైర్మన్ అల్లంరాజు రామశాస్త్రి, క్రియా కార్యదర్శి జగన్నాథం, సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రపంచాన్ని శాసిస్తున్న సైన్స్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రపంచాన్ని శాసిస్తున్నది నడిపిస్తున్నది సైన్స్ మాత్రమేనని డిఇఒ పిల్లి రమేష్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక సాలిపేట పైండా సత్తిరాజు మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ పాఠశాలల నుంచి 94 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభలో డిఇఒ పాల్గొని మాట్లాడారు. మన దైనందిన జీవితంలో, ఆధునిక యుగంలో సైన్స్ లేని జీవితాన్ని ఊహించలేమన్నారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్ వినీల్ మాట్లాడుతూ జాతీయ సైన్స్ దినోత్సవాన్ని అన్ని పాఠశాలలలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. సైన్స్, క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్‌లో విజేతలకు డిఇఒ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు, హెచ్‌ఎం జె.సుబ్బలక్ష్మి, చింతా నారాయణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొరియర్, పార్శిల్స్ కార్యాలయాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని కొరియర్ సర్వీసులు, రవాణా ఏజెన్సీలపై పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. కాకినాడ నగరంలో రెండు రోజుల కితం ఒక పార్సిల్ సర్వీస్ గోడౌన్‌లో జరిగిన పేలుడు నేపథ్యంలో సోదాలు నిర్వహిస్తున్నట్టు స్థానిక సిఐ కృష్ణభగవాన్ చెప్పారు. జాగిలాలు, బాంబులను నిర్వీర్యం చేసే విభాగం, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొని విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కొరియర్ సేవలు, రవాణా సేవలు అందించే కార్యాలయాల్లో దీపావళి బాణాసంచా, ప్రేలుడు పదార్థాలు, పేలుడు సంభవించే గుణంగల రసాయనాలు, మాదకద్రవ్యాలు వంటి వాటి కోసం సోదాలు నిర్వహిస్తూ, అనుమానాస్పద వస్తువులపై ఆరా తీశా రు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు పాల్గొన్నారు.

నోడల్ సంస్థగా ఆదిత్య

ప్రజాశక్తి - గండేపల్లి

ఉభయ తూర్పు గోదావరి, యానాం జిల్లాల స్థాయి 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025' నిర్వహించడానికి నోడల్ సంస్థగా ఆదిత్య యూనివర్సిటీ ఎంపిక చేసిందని యూనివర్సిటీ ప్రో ఛాన్సిలర్. ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. నోడల్ సంస్థగా ఆదిత్యను ఎన్నిక చేసినందుకు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రో ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సిలర్. డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, అభినందనలు తెలిపారు.

ఆవిర్భావ వేడుకలకు భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - పెద్దాపురం

మీడియాతో మాట్లాడుతున్న రామస్వామి

ఈనెల 14న పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించే జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జనసేన జిల్లా అధ్యక్షులు, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిత్రాడ గ్రామంలోని లే అవుట్ స్థలంలో జనసేన 14వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించబడతాయన్నారు. ఈ వేడుకలకు సుమారు 10 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఎంఎల్‌సి హరిప్రసాదతో పాటు జిల్లా పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో 14 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొంటారని తెలిపారు. ముఖ్యంగా ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి పెద్దఎత్తున జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

భాషపై నిరంతర అధ్యయనం అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

ఆలోచనలు, భావాలు ఎదుటివారికి అర్థం కావలంటే భాషపై నిరంతర అధ్యాయనం అవసరమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కెఎస్.రమేష్ అన్నారు. స్థానిక ఐడియల్ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆర్ట్ అండ్ టెక్నిక్ ఆఫ్ కమ్యూనికేషన్ అనే అంశంపై వారం రోజులపాటు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంగళవారం 2వరోజు కార్యక్రమంలో ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఇంగ్లీషు అనేది ఒక సబ్జెక్ట్ కాదని ఒక భాష అని అన్నారు. ఆలోచనలు, భావాలు ఎదుటివారికి అర్థం కావలంటే భాషపై నిరంతర అధ్యాయనం చేయాలన్నారు. ఇందుకోసం ఫ్రీడమ్ ఫైటర్స్, కథలు, నవలలు, న్యూస్ పేపర్లు, పుస్తకాలను అధ్యాయనం చేయాలన్నారు. అప్పుడే కమ్యూనికేషన్‌లో చక్కని కళ, సాంకేతికత లభించి విద్యార్థులను తీర్చిదిద్దవచ్చని అన్నారు. ఐడియల్ కళాశాలల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా భాషా సామర్థ్యాన్ని పెంచుకోవడం చాలా అవసరమన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగాధిపతి ఎల్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ భాష మెళకువలను బోధించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ టి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు యు.నానిబాబు, ఎం.రాజేష్, ఐడియల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ జివి.కృష్ణంరాజు, చింతపల్లి సుబ్బారావు, సిద్ధార్థబాబు, స్వరూప్, డాక్టర్ స్టీవెన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

'రాక్'లో భద్రతా వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట



ప్రతిజ్ఞ చేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

స్థానిక రాక్ సిరమిక్స్ పరిశ్రమలో 54వ జాతీయ భద్రత వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. హెచ్‌ఆర్ అడ్మిన్ టి.నీరజ్‌కుమార్ భద్రత పతాకాన్ని ఎగురవేసి భద్రత వారోత్సవాలని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో ఉన్న ప్రతి అధికారి, కార్మికులు భద్రత నియమాలు పాటించాలన్నారు. తద్వారా పరిశ్రమ, సమాజ శ్రేయస్సుకు పాటు పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రాజిందర్ సింగ్ మాన్, టైల్స్ హెడ్ వినోద పైక వాసుదేవ, శానిటరీ వేర్ హెడ్ చెల్లదురై, పర్చేజ్ హెడ్ వెంకటేశ్వర రావు, ఇహెచ్‌ఎస్ మేనేజర్ బాలాజీ, పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ విజిఎస్.కుమార్, కంపెనీ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు. వేట్లపాలెం జడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

బిఎఫ్ఎస్ఐ స్కిల్ సెక్టార్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాలలో బిఎఫ్ఎస్ఐ స్కిల్ సెక్టార్ కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని ఎఇడిపి కళాశాలల కో-ఆర్డినేటర్లు, ప్రిన్సిపల్స్ పాల్గొని బిఎఫ్ఎస్ఐ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ యొక్క అభివృద్ధి, సహకార కార్యక్రమాలపై చర్చించారు. ఈ సమావేశంలో బిఎఫ్ఎస్ఐ స్కిల్ కౌన్సిల్ సెక్టార్ సంస్థాగత అధిపతి నబ్రూన్ చక్రవర్తి పాల్గొని కార్యక్రమ లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణను వివరించారు.ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి కోర్సుకు సంబంధించిన సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రిస్ప్ సంస్థ కో-ఆర్డినేటర్ నాగేశ్ బాబు, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌ఎజి.అన్సర్ అలీ, వైస్ ప్రిన్సిపల్ సి.సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

సంగిత సుబ్బారావు, S/o. సంగిత నాగన్న, డో.నెం. 1-72, మెయిన్‌రోడ్డు, సంగీత హౌస్, పినపల్లె, తూర్పుగోదావరి జిల్లాలో నివసిస్తున్న నా యొక్క **ఒరిజినల్ దస్తావేజు నెం. 10447/2018, Dt. 21-9-2017,** రాజమండ్రి సబ్ రిజిష్టర్ వారి ఆఫీస్‌లో రిజిష్టర్ కాబడిన ఒరిజినల్ దస్తావేజు **ది. 25-2-2025వ తేదీన** రాజమండ్రి ప్రకాష్‌నగర్ రౌండ్ పార్కు వద్దకు జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా ప్రకాష్‌నగర్ పార్క్ వద్ద పడిపోయినది. ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కి తెలియపర్చ వలసిందిగా కోరుచున్నాను.

సంగిత సుబ్బారావు
డో.నెం. 1-72, మెయిన్‌రోడ్డు, సంగీత హౌస్, పినపల్లె, తూర్పుగోదావరి జిల్లా, సెల్: 98481 86463

దస్తావేజులు పోయినవి

పిఠాపురం పట్టణమునకు చెందిన శీరం నాగ సత్యనారాయణ, తండ్రి: లక్ష్మణమూర్తి గారికి పిఠాపురం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజు నెం. 1731/2012, 3724/2014, 121/2015, 1675/2018 లు చెందియున్నవి. సదరు దస్తావేజులను ది. 20-02-2025వ తేదీన జిరాక్స్ నిమిత్తం పిఠాపురంలో మా ఇంటి నుండి చర్చి సెంటర్‌లో జిరాక్స్ షాపునకు జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా దారిలో ఎక్కడో పడిపోయినది. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు అందజేయగలరు.

శీరం నాగ సత్యనారాయణ
తండ్రి: లక్ష్మణమూర్తి, డో.నెం. 3-2-25, ఎం.ఆర్.పేట, పిఠాపురం, సెల్: 73964 70999

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
O.S. 188/2017

Between:
వాది: Bathula Esther Rani
AND
7వ ప్రతివాది:
Abbireddi Janaki, W/o. Pangam Rajasekhar, D.No. 3-4-174/23/506, K.K.R. Apartments, ICICI Bank, Kantha reddy Nagar, Athapuram, Hyderabad, Telangana State.

వాది గారు ప్రతివాద్లు పయిన దావా ప్లయింటు షెడ్యూలు దాఖలా ఆస్తులను పంపకం నిమిత్తం మరియు యితర పరిహారములు నిమిత్తం దాఖలు చేసిన పై నెంబరు దావాలో పైన తెలిపిన 7వ ప్రతివాదికి ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు 7వ ప్రతివాది పై కోర్టు వారి ఎదుట **ది. 10-3-2025వ సం॥రం తేదీని పగలు గం॥ 10.30 ని॥లకు** హాజరయి ఆక్షేపణలు వున్న యెడల తెలియపర్చుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందు మూలంగా తెలియపర్చడమయినది.

కాకినాడ 3-3-2025
అల్తాఫ్ మహమ్మద్
వాది తరపు అడ్వకేటు

మహారాజశ్రీ 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 155/2024

Between:
Medisetti Venkateswara Apparao, S/o. Venkata Ramana, Hindu, aged 58 years, Business, Resident of Door No. 12-11-18/A, Dammuvari Street, Aryapuram, Rajamahendravaram, East Godavari District, A.P. ***...Plaintiff***
AND
1. Naidu Srinivasa Rao, S/o. Krishna murthy, Hindu, aged 46 years, Business, Door No. 20-22-45, 6th Street, Ramachandrarao peta, Tumalava, Rajamahendravaram, East Godavari District.
2. Naidu Naga Lakshmi, W/o. SrinivasaRao, Hindu, aged 41 years, House wife, Door No. 20-22-45, 6th Street, Ramachandrarao peta, Tumalava, Rajamahendravaram, East Godavari District.
...Defendants

పై నెంబరు దావాలో 1, 2 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 25-3-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి 04-3-2025
జి.అప్పారావు
అడ్వకేట్, రాజమండ్రి